వేధిస్తున్న సిబ్బంది కొరత

- మున్సిపాలిటీగా మారినా గత జీపీ కార్మికులతోనే నెట్టుకొస్తున్న అధికారులు
- కేవలం ప్రధాన రహదారులనే శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది
- అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


నేరేడుచర్లలోని 3వ వార్డులో సంచరిస్తున్న పందులు


స్వాగత్ థియేటర్ ఖాళీ స్థలంలో చెత్తచెదారం

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లకు ఇరువైపులా చెత్తచెదారం దర్శనమిస్తోంది. పారిశుధ్య లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పందులు వీధుల్లో విహరిస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ సిబ్బంది కొరతతో ప్రధాన రహదారులనే శుభ్రం చేస్తున్నారని దీంతో వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీగా మారినా..

కాగా, గ్రామ పంచాయతీగా ఉన్న నేరేడుచర్ల 2018 ఆగస్టు 1న మున్సిపాలిటీగా మారింది. దీంతో ఆ గ్రామ పంచాయతీలో ఉన్న కార్మికులనే మాత్రమే నేడు మున్సిపాలిటీలో కొనసాగిస్తున్నారు. అయితే నేరేడుచర్ల గ్రామ పంచాయితీ మున్సిపాలిటీగా మారినప్పుడు దిర్శించర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సయ్యగూడెం, నేతాజీనాయక్, ఎన్‌టీఆర్‌నగర్, రాంపూరం గ్రామ పంచాయతీ, చిల్లేపల్లి గ్రామ పంచాయతీలోని రాంగిరిలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఇక మున్సిపాలిటీగా మారినా కూడా మున్సిపల్ సిబ్బందిని పెంచకుండా గతంలో గ్రామపంచాయతీలో ఉండే సిబ్బందితో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. మొత్తం పారిశుధ్య సిబ్బంది 35 మంది ఉండగా వీరిలో ప్రతి రోజు 3 నుంచి ఐదుగురు ఏదో కారణం చేత విధులకు హాజరు కావడం లేదు. అదేవిధంగా మున్సిపాలిటీలో ఒక ట్రాక్టర్‌తో పాటు నాలుగు చెత్త వాహనాలు, ఒక డోజర్, ఇద్దరు పంపు ఆపరేటర్లు, ఒకరు ఎలక్ట్రీషియన్, ఒకరు అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. 35 మంది సిబ్బందిలో 12 మంది ఆఫీస్, వాహనాలకు పోనూ 23 మందితో ప్రతిరోజు ప్రధాన రహదారులైన జాన్‌పహాడ్ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు, రాంపూరం రోడ్డులను మాత్రమే శుభ్రం చేసి చెత్తను తరలిస్తున్నారు.

వారానికి ఒక్కరోజే చెత్త సేకరణ..

మున్సిపాలిటీలో గల 15 వార్డుల్లో నెలకు ఒక్కసారి మాత్రమే డ్రెయినేజీల పూడిక తీస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతుండంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రతిరోజు చెత్తను సేకరించాల్సి ఉండగా వారానికి ఒక్కరోజు మాత్రమే సేకరిస్తుండటంతో చెత్త బుట్టలు ఇచ్చి ఏమి ప్రయోజనమని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కొన్ని వార్డుల్లో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో పందులు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల మధ్యలో మురుగునీరు నిలిచి దోమలు విపరీతంగా ఉండటంతో విష జ్వరాల భారిన పడుతున్నారు. మున్సిపాలిటీలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బ్లీచింగ్ కొనుగోలు చేస్తున్నప్పటికీ ఎక్కడ కూడా చల్లిన దఖలాలు లేవు. ఇక రాత్రి వేళల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నప్పటికీ ఫాగింగ్ చేసిన నాథుడు లేడు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం స్పందించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తాం



మున్సిపాలిటీలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉండటంతో పాటు వేసవి కాలం కావడంతో ఒక్కపూట మాత్రమే విధులకు వస్తున్నారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉన్నచోట తక్షణమే శుభ్రం చేయిస్తాం.

– వెంకటేశ్వర్లు, కమిషనర్ నేరేడుచర్ల

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

గరిడేపల్లి : మండల తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ వెంకట్రావు సందర్శించారు. అనంతరం మండలంలోని రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్ల వివరాల గురించి తహసీల్దార్ జి.కార్తీక్‌ను అడిగి తెలుసుకున్నారు. గొనె సంచుల సమస్య, ధాన్యం లోడింగ్ అన్‌లోడు సమస్య ఏమైన ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ధరణిలో రిజిస్ట్రేషన్, పెండింగ్ స్లాట్లు గురించి వాకబ్ చేశారు. ఓటరు నమోదు దరఖాస్తులు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


గరిడేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం ఆయన నేరేడుచర్ల మున్సిపల్ సాధారణ సమావేశానికి హాజరయ్యేందుకు రాగా అనివార్య కారణాలతో సమావేశం వాయిదా పడటంతో మున్సిపల్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపడుతున్న రోడ్ల వెడల్పు, మున్సిపల్ అభివృద్ధి నిధులు రూ.10 కోట్లతో చేపడుతున్న వివిధ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీటిని త్వరలో సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా వైకుంఠధామం, పార్క్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మేనేజర్ అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఏకాగ్రతతో చదివి లక్ష్యాన్ని సాధించాలి


మిట్స్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ కొర్ల శ్రీకాంత్

చిలుకూరు : ఇంజనీరింగ్ విద్యార్థులు ఏకాగ్రతతో కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించుకోవాలని వరంగల్ నీట్ కళాశాల ప్రొఫెసర్ కొర్ల శ్రీకాంత్, కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండల పరిధిలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల వ్యవస్థాపకుడు మధిర బ్రహ్మారెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన ఫౌండర్స్ డే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఒరవడితో, మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకొని నూతన ఆవిష్కరణలు కనిపెట్టాలన్నారు. పాత పద్ధతిలో చదువును పుస్తకాలకే పరిమితం చేయకుండా టెక్నాలజీని ఉపయోగిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో వెనుకబడిన విద్యార్థులను గొప్ప ఇంజనీర్‌లుగా తయారు చేయాలనే లక్ష్యంతోనే 20 ఏళ్ల క్రితమే మధిర బ్రహ్మారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల స్థాపించారని తెలిపారు. అనంతరం కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి మాట్లాడుతూ మిట్స్ కళాశాలను డ్రీమ్ యూనివర్సిటీగా తీర్చిదిద్ది పలు ఇంజనీరింగ్ కళాశాలలకు మార్గదర్శకంగా తయారు చేయడమే లక్ష్యమని తెలిపారు. ముందుగా బ్రహ్మారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్ పర్సన్ మధిర సావిత్రిరెడ్డి, వైస్ చైర్మన్ మధిర గౌతంరెడ్డి, డైరెక్టర్ సుమన్‌వర్మ, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిట్స్ కళాశాలలో టాస్క్ శిక్షణ తరగతులు

కోదాడఅర్బన్ : కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థినులకు స్ట్రక్చర్ క్యూరీ లాంగ్వేజ్ (ఎస్‌క్యూఎల్)పై ఆరు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తెలిపారు. శనివారం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాగా టాస్క్ నిపుణుడు పి.మురళీధర్.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించుకునే నైపుణ్యాలను, మెళకువలను విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, అకడమిక్ అడ్వైజర్ పోతుగంటి నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ సాధారణ సమావేశం అనివార్య కారణాల వలన వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడారు. సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు.

రూ.25 వేల విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి శనివారం బృందావనపురం గ్రామ మాజీ సర్పంచ్ రేపాల ఉషారాణి, పురుషోత్తం దంపతులు రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామారావు కుటుంబానికి పరామర్శ


ఆర్థికసాయం అందజేస్తున్న కేఎల్‌ఎన్ ప్రసాద్, సభ్యులు

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు వల్లపుదాసు రామారావు ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందారు. శనివారం కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపకుడు కేఎల్‌ఎన్ ప్రసాద్.. రామారావు కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బెల్లంకొండ రమణ నాగయ్య, టీడీపీ మండల కన్వీనర్ కొండా సోమయ్య, గౌడ ఉద్యోగ సంఘం నాయకులు కొండా వెంకయ్య, మండవ ఉపేందర్, నాయకులు యరగాని నాగయ్య, శేషయ్య, అచ్చయ్య, వీరబాబు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ


దివ్య

గరిడేపల్లి : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థి బాణోతు దివ్య ఎస్టీ కేటగిరిలో 2046వ ర్యాంకు సాధించింది. కోదాడ మండలం బీకే తండాకు చెందిన దివ్య నాన్న చిన్నప్పుడే చనిపోయారు. దీంతో తన తల్లి కష్టపడి ప్రభుత్వ స్కూల్‌లో చదివించింది. కాగా జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ర్యాంకు సాధించిన దివ్యను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్లాస్టిక్ కవర్లు తిని ఆవు మృతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ప్లాస్టిక్ కవర్లు తిని అనారోగ్యానికి గురైన ఆవు మృతి చెందింది. ఈ సంఘటన చింతలపాలెంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు గొంగరెడ్డి ఈశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆవు గ్రామ శివారులో ప్లాస్టిక్ కవర్లు తిని గత నాలుగు రోజులుగా మేత మేయకుండా నెమరు వేయకుండా ఉంటోంది. పశువైద్యులకు చూపించగా ఇంజక్షన్‌లు చేసి వైద్యం చేశారు. అయినా కోలుకోని ఆవు శనివారం మృతి చెందింది. దీంతో తమకు దాదాపు రూ.70 వేల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. తమకు పరి హారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

నడిగూడెం : శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు మునగాల సీఐ పి.వీరరాఘవులు తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని కేసుల నమోదు రిజిస్టర్‌లు, సిబ్బందికి సంబంధించిన పలు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌ఐ పి.ఏడుకొండలు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్ : ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వివిధ వార్డులలో దాదాపు 9 మందికి మంజూరైన రూ.3.51 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం ఆయా కౌన్సిలర్లతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అమర్‌గౌడ్, గౌట్టె రామయ్య, కౌన్సిలర్లు ఫణికుమారి, జె.శంభయ్య, వై.గురవయ్య, గాయత్రి, భవాని, ఎం.రామ్‌గోపి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే సమావేశం వాయిదా

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు, అక్రమాలపై ప్రశ్నిస్తామనే భయంతోనే మున్సిపల్ సాధారణ సమావేశాన్ని వాయిదా వేశారని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొణతం చిన వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11:05 గంటలకు సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కాకముందే వాయిదా వేశారని, వాయిదా వేయడంతో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సమావేశానికి ముందుగా సభ్యులతో చర్చించి పలు అంశాలను ఎజెండాలో పొందుపరచాలని కోరినప్పటికి పట్టించుకోకుండా ఏకపక్షంగా సొంత ఎజెండాను రూపొందిస్తున్నారన్నారు. మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత నూతనంగా పారిశుధ్య సిబ్బందిని నియమించకపోవడంతో పలు వార్డుల్లో పారిశుధ్య సమస్యలు పెరిగిపోయాయని అన్నారు. పట్టణ శివారుల్లో స్వాగత బోర్డులు మున్సిపల్ పాలక వర్గ సభ్యుల పేర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నప్పటికీ నేటికీ ఎలాంటివి ఏర్పాటు చేయలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాశ్, జితేందర్‌రెడ్డి, నాగయ్య, సుగుణ, సరిత తదితరులున్నారు.

ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషిచేస్తా

చిలుకూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య అన్నారు. శనివారం చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన జన ఆరోగ్య సమితి సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ ఈదయ్య, సర్పంచ్ కొడారు బాబు, సూపర్‌వైజర్ సునీత, డాక్టర్లు నవ్య, ధర్మతేజ, ఆయుష్ డాక్టర్ సుశీల, సూపర్‌వైజర్ సావిత్రి, సూపరింటెండెంట్ కీర్తి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సుబ్బయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

మోతె : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని విభళాపురం గ్రామంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు వరి, మామిడి, మిర్చి పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయినారన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లు, కేంద్ర ప్రభుత్వం రూ.15 ల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తడిసిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, మండల కార్యదర్శి ముల్కూరి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు సత్యనారాయణ, కిన్నెర పోతయ్య, బాపనపల్లి నాగయ్య, కుంచం గోపయ్య, ఎలుగు మధు, సాగర్‌రెడ్డి, మణెమ్మ, జహీనాబీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి

మునగాల : మునగాల పరగణా పేదప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న నిస్వార్థ సేవాపరుడు, అమరజీవి ముదిరెడ్డి ఆదిరెడ్డి ఆశయసాధనకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు కోరారు. మండలంలో ఆదిరెడ్డి స్వగ్రామమైన నర్సింహులగూడెంలో నిర్వహించిన ఆయన 26 వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఆదిరెడ్డి స్మారకస్థూపం వద్ద జెండావిష్కరణ చేసి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య, మండల కమిటీ సభ్యులు రాపోలు సూర్యనారాయణ, షేక్ సైదా, జె.విజయలక్ష్మి, డి.స్టాలిన్‌రెడ్డి, జె.కొండారెడ్డి, టి.సతీష్, పిడమర్తి అబ్రహం, పి.గుర్వయ్య పాల్గొన్నారు.

కొక్కిరేణిలో..

నర్సింహులగూడెం మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి 26వ వర్ధంతి సందర్భంగా శనివారం మండలంలోని కొక్కిరేణిలో సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నందిగామ సైదులు, రేఖ లింగయ్య, మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, ఉపసర్పంచ్ బ్రహ్మం, నిడిగొండి శంభయ్య, హుస్సేన్, శేషగిరి, వట్టెపు చినసైదులు, ములకలపల్లి సైదులు పాల్గొన్నారు.


మునగాల : నర్సింహులగూడెంలో జెండా ఆవిష్కరిస్తున్న బుర్రి శ్రీరాములు

కోదాడఅర్బన్ : కోదాడలోని సీపీఎం కార్యాలయంలో ముదిరెడ్డి ఆదిరెడ్డి 26వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నాయకులు జట్టుకొండ బసవయ్య, ఎం.ముత్యాలు, పద్మావతి, సాయికుమార్, వెంకన్న, శ్రీనివాస్, శరభందరెడ్డి, సత్తిరెడ్డి, కొండల్ దితరులు పాల్గొన్నారు.

మే డే వేడుకలను విజయవంతం చేయాలి


కోదాడఅర్బన్ : హమాలీలతో కలిసి మేడే కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

కోదాడఅర్బన్ : మేడేను కార్మికులు ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం కోదాడ బాలాజీనగర్‌లోని ఎస్‌ఎఫ్‌సీ గోదాముల వద్ద నిర్వహించిన హమాలీ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం హమాలీలతో కలిసి మే డే కరపత్రం ఆవిష్కరించారు. సమావేశంలోయూనియన్ నాయకులు భూక్యా పాపానాయక్, ధీరావత్ సైదా, శ్రీను నాయక్, లింగయ్య, వెంకటేశ్వర్లు, రవి, పెరుమాళ్ళ కొండలు, తదితరులు పాల్గొన్నారు.

కోదాడఅర్బన్ : కోదాడలోని లాల్ బంగ్లా ఎదుట శనివారం మేడే ఉత్సవాల పోస్టర్‌ను ఐఎఫ్‌టీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వక్కవంతుల నర్సింహారావు మాట్లాడుతూ శ్రమ జీవుల పోరాట దినమైన మేడేను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, విజయ్, మైసయ్య, కొండలు, రామారావు, వీరబాబు, ఖాసీ, నరేష్, నందు, వెంకన్న పాల్గొన్నారు.

కార్మికులు ఏకం కావాలి

గరిడేపల్లి : కార్మిక హక్కుల కోసం కార్మికులు ఏకం కావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరండి శివ అన్నారు. శనివారం మండలంలోని గడ్డిపల్లిలో తెలంగాణ ప్రగతిశీల హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో పాల్గొని మేడే ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఆ సంఘం నాయకులు నందిపాటి శ్రీను, శేఖర్, నగేష్, గోపి, మణి, బాబు జ్యోతి, వరలక్ష్మి తదితరులున్నారు.

కార్పొరేట్ కబంధ హస్తాల్లో దేశం

కోదాడఅర్బన్ : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, అడ్డగోలుగా పెరుగుతున్న ఇంధనం, నిత్యావసరాల ధరలు చూస్తుంటే దేశం కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల్లో బంధి కాబోతుందని, దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. శనివారం కోదాడలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన మేడే సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేడే ఉత్సవాలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మేలక శ్రీనివాసరావు, బత్తినేని హనుమంతరావు, లతీఫ్, బొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జూనియర్ కార్యదర్శుల సమ్మె


చిలుకూరులో సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు


హుజూర్‌నగర్‌రూరల్ : ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ కార్యదర్శులు

మునగాల : మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం రెండవ రోజుకు చేరుకుంది. వీరి సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు పందిరి నాగిరెడ్డి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్‌ను క్రమబద్దీకరించాలని, అవుట్ సోర్సింగ్‌లో నియమించబడిన వారిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ విద్యాసంస్థల సీఈఓ ఎస్ఎస్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేసేవరకూ సమ్మె

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : తమ సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ చింతలపాలెంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మహ్మద్ రఫీ, జేపీఎస్‌లు రమాదేవి, అనిత, రవి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అధికారుల సంఘీభావం

హుజూర్‌నగర్‌రూరల్ : నాలుగేళ్ల సర్వీస్ పూర్తయినందున తమని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండోరోజుకు చేరింది. సమ్మెకు శనివారం ఉపాధి హామీ అధికారులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు ఐతగాని నాగమణి, బొమ్మగాని నరేష్, మేకల శేఖర్, బాల్దూరి ఇందిరా, మాతంగి రేణుక, సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓకు జేపీఎస్‌ల వినతి

మఠంపల్లి : తమ సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలని మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన దీక్ష శనివారం రెండవరోజుకు చేరింది. ఈ సందర్భంగా మఠంపల్లికి వచ్చిన డీఎల్‌పీఓ శ్రీరాములుకు జేపీఎస్‌లు వినతిపత్రం అందించారు. జేపీఎస్‌ల సంఘం మండల కమిటీ అధ్యక్షుడు చంటి, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, ప్రవీణ్, ఉమా తదితరులున్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా తన అమ్మతో పాటు జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మాధవగూడెం జీపీ కార్యదర్శి కవిత కుమారుడు సమ్మెలో పాల్గొన్నాడు. కాగా సమ్మెకు ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండు యాదవ్‌లు, పలువురు సర్పంచ్‌లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అశోక్ వర్మ, సారిక, గ్రామ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రామారావు, శోభన్‌బాబు, కార్తిక్, కవిత, నవీన్, అవినాష్‌రెడ్డి, అంజయ్య, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకోవాలి

కోదాడరూరల్ : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న నిరసన సమ్మె శనివారం రెండోరోజుకు చేరకుంది. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకటనారాయణ మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి అయినందున్న తమను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ప్రభాకర్, వీరబాబు, బాలరాజు, ఉపేందర్, నాగలక్ష్మి, కావ్య ఉన్నారు.

మోతె : రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను నెరవేర్చేంత వరకు సమ్మె కొనసాగుతుందని జేపీఎస్‌ల సంఘం మండల అధ్యక్షుడు సోందు అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న సమ్మెలో ఆయన శనివారం మాట్లాడారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సతీష్‌రెడ్డి, సంపత్, నాగరాజు, పూర్ణచందర్, సింధు, కవిత పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెకు పలువురు నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నేరేడుచర్ల : రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న జూనియర్ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో జరుగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, నాయకులు సత్యం, శ్రీను, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు నర్సింహ, సందీప్‌రెడ్డి, రమ, సాయి, వెంకటేష్, పద్మ తదితరులున్నారు.

సీఎం మాట తప్పడం దురదృష్టకరం

గరిడేపల్లి : మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన ప్రకారం జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయకపోవడం దురదృష్టకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీతారాంరెడ్డి, చాంద్‌మియా, కృష్ణ, విజయ, చంద్రారెడ్డి, సందీప్, పరమేష్, మోహన్, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం గరిడేపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి, నాయకులు కడియాల అప్పయ్య, అంబటి గోవింద్‌రెడ్డి, పీరాసాబ్, నబిసాహెబ్, పంగ యాదయ్య తదితరులున్నారు.

అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా శకుంతలరెడ్డి

గరిడేపల్లి : కాంగ్రెస్ పార్టీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ మహిళా విభాగం కన్వీనర్‌గా మండలంలోని కొండాయిగూడెం గ్రామానికి చెందిన కేతిరెడ్డి శకుంతలరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ఆమెకు కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ కిషన్‌రావు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకుతలరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అనురాధ కిషన్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా శకుంతలరెడ్డి నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు కిషన్‌రావు, కందుల కోటిరెడ్డి, త్రిపురం అంజన్‌రెడ్డి, పరమేష్, కృష్ణప్రసాద్, దామోదర్‌రెడ్డి, గోపిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి


మాట్లాడుతున్న గురువయ్య

నేరేడుచర్ల : నేరేడుచర్లలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మానవ హక్కుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చింతమళ్ల గురువయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన నేరేడుచర్లలో గత 61 రోజులుగా పేదల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరహార దీక్షలకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాల వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య, నాయకులు ఉరిమళ్ల రామ్మూర్తి, వీరస్వామి, రోషయ్య తదితరులున్నారు.

నేల ఆరోగ్య పరిరక్షణపై డీలర్లకు శిక్షణ

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లిలో గల శ్రీ అరబిందో కృషి విజ్ఞాన కేంద్రంలో సమ్మేతి మరియు మేనేజ్ హైదరాబాద్ వారి సహకారంతో శనివారం నేల ఆరోగ్య పరిరక్షణపై కేవీకే మృత్తిక శాస్త్రవేత్త ఏ.కిరణ్ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందుల (దేశీకోర్సు) డీలర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మట్టి నమునాలు సేకరించే విధానం, వాటి ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ యాజమాన్య పద్ధతులు, మృత్తికలో పోషకాలపై అవగాహన కల్పించారు. నేలలు పునరుద్ధరించే పద్ధతులు, పచ్చిరొట్టె ఎరువుల ప్రాముఖ్యత, సేంద్రియ పద్ధతుల్లో భూసారాన్ని పెంచే పద్ధతులు తదితర విషయాలను వివరించారు. అనంతరం మట్టి నమునాల సేకరణ, పరిరక్షించే విధానాన్ని డీలర్లకు ఆయన చూపించారు. ఈ కార్యక్రమంలో దేశీ ఫెసిలిటెటర్ పి. శంకర్‌రావు, 40 మంది డీలర్లు తదితరులు ఉన్నారు.